# క్షమించు కస్తూరి!

**-కోయిల్ కందాళ**

ఇలలో జరగని వింతలు కలలో కనడం కద్దు. కానీ ఇలలోనే ఇంతటి విభ్రమ, దారుణ స్థితి దాడి చేస్తుందనుకోలేదు సుహాస్. వాస్తవ జగత్తులోనే నాన్న సందేహాస్పద పరిస్థితిలో కూరుకుపోయాడు. ఒక్కసారిగా అరికాళ్ల క్రింద కంకర రాళ్ళు గుచ్చుకున్నట్లుగా కదలిపోయి వెనుదిరిగాడు.

స్కూటర్‌ని గుర్రంలా ఉరికించి నైట్‌క్వీన్ లాడ్జికి కొద్దిదూరంలో ఓ సందులో ఆపాడు. రెండునిముషాల అనంతరం లాడ్జి ముందు రిక్షా ఆగింది. అందులోంచి అందమైన అమ్మాయి దిగి లోనికి వెళ్లిపోయింది.




అంతే! చూడరానిది, చూడకూడనిది చూసినప్పుడు మనిషిలో ఏర్పడే దారుణ ఘర్షణ సుహాస్‌లో ప్రారంభమైంది. తను ప్రేమ వివాహాలంటూ పట్టింపులకు పోలేదు. సలక్షణ వధువునే వివాహం చేసుకోవాలనుకున్నాడు. కానీ ఇంతలో ఈ తుపాను... వరుసగా నాలుగురోజులు అదే దృశ్యం.

కస్తూరి ఎంతటి నీతిమాలినదైపోయింది. కూతుర్ని ప్రోత్సహించి పంపే తల్లిదండ్రులు బహూశా ఈ సంఘంలో ఉండరేమో! స్కూటర్ స్టాండ్ వేసి ఇంట్లోకి వెళ్లబోయి ఏవో మాటలు వినిపించి ఆగాడు సుహాస్.

"కస్తూరీ! ఈ రోజింత ఆలస్యం చేస్తే ఎలాగమ్మా! అవతలవాళ్లంతా ఎదురుచూస్తూ కూర్చుంటారుకదా" అన్నాడు కస్తూరి తండ్రి రఘురామయ్య.

"అబ్బా...రోజూ వెళ్లేదేగా.. కొత్తగా చెప్తారేమిటి?" అంది కస్తూరి.

"మనం డబ్బు వసూలు చేస్తున్నప్పుడు అక్కడ రెండుగంటలపాటయి గడపకపోతే ఎలాగమ్మా?" అంది తల్లి.

ఛ... ఒక ఆడపిల్లకు తల్లిదండ్రులుగా తమ కూతుర్ని డబ్బుకోసం లాడ్జికి పంపిన నికృష్టులు... ఇంత అఘాయిత్యం, ఘోరం ఎక్కడన్నా వుంటుందా? అందుకే కస్తూరిని తను పెళ్లి చేసుకునేదిలేదని చెప్పేయాలి. ఆ నిర్ణయం కారుమబ్బులా కమ్మింది. సుహాస్ నిర్ణయం విన్న కస్తూరి తల్లిదండ్రులు నిర్ఘాంతపోయారు. కారణం అడిగారు, ప్రాధేయపడ్డారు. తప్పులుంటే క్షమించమని అడిగారు. పీటలదాకా వెళ్లిన పెళ్లిని రచ్చకెక్కించవద్దని వేడుకున్నారు. వారి మాటలకు విలువ ఇవ్వక తిరుగుముఖం పట్టాడు.

ఇది జరిగిన సాయంత్రం వనిమీద విశాఖపట్నం బయలుదేరాడు సుహాస్.

***

ఆఫీసుకు సెలవుపెట్టి ఏదో పుస్తకం చదువుతున్నాడు సుహాస్. గుమ్మం దగ్గర నిలబడ్డ తండ్రిని చూసి ఒక్కసారిగా కంగారుపడ్డాడు.

"సుహాస్"

తను కస్తూరి ఇంట జగడమాడి సంబంధం తెగ్గొట్టేయడం, ఈ విషయమై తండ్రితో ప్రస్తావించకపోవడం, బహూశా తన ఊరువెళ్లిన సాయంత్రమే కస్తూరి తండ్రి వచ్చి కాళ్లవేళ్లా పడడం... వీటన్నిటిమూలంగానే తండ్రి తనను నిలదీయాలని చూస్తున్నాడు.

"ఏంటి నాన్నగారూ"

"నీచేత అలా పిలిపించుకోవడానికి నాకు సిగ్గుగా ఉంది. ఛ... మన వంశానికే మచ్చ తెచ్చావు"

"నాన్నా...అదీ..అదీ..."

"నువ్వు నాకు ఏం చెప్పనక్కర్లేదు. అంతా నాకు తెలుసు. అయినా నీలో ఎందుకింతగా మార్పు వచ్చింది?"

"దాని వెనుక కారణాలు మీకు తెలియవు నాన్నా"

"త్రాగడానికి కూడా కారణాలుంటాయా?"

"త్రాగడమా?" అర్థంకాలేదు సుహాస్‌కి.

"నిన్నే...ఈ మధ్యన నీ వ్యవహారం చాలా శృతిమించింది"

"అసలు ఎవరు చెప్పారు నేను త్రాగుతున్నానని"

"ఒకరి మాటలు నమ్మి నిన్ను అనుమానించే మూర్ఖుడినికాను"

"మరి?"

"స్వయంగా నా కళ్లతో నేను చూసాను"

"ఏం చూసారు?"

"కళ్యాణీ బార్ దగ్గర నీ స్కూటర్ పార్క్ చేసి ఉండడం, గంటలకొద్దీ బార్‌లో గడిపి రావడం..."

"మీరు పొరబడుతున్నారు. ఆ బార్ యజమాని నా స్నేహితుడు. రోజూ వాడ్ని కలసి రావడం నాకలవాటు"

"అబద్ధం. నీ స్కూటర్ నా కళ్లబడిందని కథలల్లుతున్నావు"

"నాన్నా! అంత అనుమానమయితే లోపలకు వచ్చి చూడలేకపోయారా? బార్ బయట నా స్కూటర్ కనబడినంతమాత్రాన నన్ను అనుమానించడం మీకు సమంజసంగాలేదు"

"అదే నేనూ అంటున్నాను. కేవలం మనం చూసిందే నిజమని నమ్మడం అవివేకం. లేకపోతే నీక్కాబోయే భార్య ఓ లాడ్జిలో గడిపి వస్తున్నదంటే దాని వెనుక నిజానిజాలు తెలుసుకోకుండా ఆ అమ్మాయి భవిష్యత్తుతో చెలగాడమాడబోయావు. రఘురామయ్యగారి మిత్రుడు ఆ లాడ్జి ఓనర్. అతడి ఇల్లు పై అంతస్తులోనే. తన కూతురికి ప్రైవేటు చెప్పడానికి కస్తూరిని పెట్టుకున్నాడు. మరో పదిమందిని పోగుచేసి ట్యూషన్ సెంటర్ పెట్టుకొమ్మని ఓ గది అద్దెకు ఇచ్చాడు. కానీ ఇవేవీ తెలియని నువ్వు కస్తూరిపై తీరని అపవాదువేసి ద్రోహం తలబెట్టబోయావు. అదేరోజు నువ్వు లాడ్జిలోకి వెళ్లి చూసి వుంటే తెలిసేది. మన కళ్ళు మననెలా మోసం చేస్తాయో తెలిసేది"

తండ్రి మాటలు కఠినంగా వినిపించినా అక్షరసత్యాలు. ఇప్పుడు సుహాస్‌కి కస్తూరి కాళ్లపై పడాలనుంది.

★